# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 08 జనవరి, 2026 | పేజీలు :08


# మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

## కలెక్టర్ పమేలా సత్పతి



ప్రజాపక్షం/కరీంనగర్ : మహిళలు తమ ఆత్మ గౌరవం కాపాడుకుంటూ అన్ని రంగాల్లో ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలని కలెక్టర్ పమేలా సత్పతి పేర్కొన్నారు. బుధవారం కరీంనగర్ కళాభారతిలో డెమొక్రటిక్ సంఘ ఆధ్వర్యంలో జిల్లాలోని పలువురు మహిళా వార్డు సభ్యులకు సన్మానం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథులుగా కలెక్టర్, డెమొక్రటిక్ సంఘ కో ఫౌండర్, సినీనటి రెజీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సుమారు 10 ఏళ్లుగా రాష్ట్రంలో పనిచేస్తున్నానని.. మహిళా పాలకులు ఉన్నచోట ప్రజా సమస్యలు తగ్గుముఖం పడుతున్నట్లు పేర్కొన్నారు. ఫౌండేషన్ సాయంతో మహిళలు ఎన్నికల్లో పోటీ చేసే విజయం సాధించడం అభినందనీయమని, భవిష్యత్తులో మరిన్ని ఆకాంక్షలు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. అందరితో గౌరవంగా మెలుగుతూ ప్రజల కోసం కష్టపడి పనిచేస్తే మంచి పేరు దనంతట అదే వస్తుందని వివరించారు. తమ్ముడు, భర్త, తండ్రి, కుమారుడు చెప్పినట్లు చేయకుండా ప్రజలకు ఉపయోగపడే పనులు చేయాలని మహిళా వార్డు సభ్యులకు సూచించారు. సినీ హీరోయిన్, డెమొక్రటిక్ సంఘ కోఫౌండర్ రెజీనా కసాండ్రా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత మహిళల్లో అసాధారణ శక్తి ఉంటుందని, సద్వినియోగం చేసుకుంటే ఉన్నత

తరువాయి 2లో

# శివరాత్రిలోగా జంక్షన్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

### రగుడు జంక్షన్ అభివృద్ధి పనుల పరిశీలన

### ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్

ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : రానున్న శివరాత్రిలోగా సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు జంక్షన్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రూ.3 కోట్ల 10 లక్షలతో సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు జంక్షన్ అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, ఇంచార్జి కలెక్టర్ బుధవారం పరిశీలించారు. జంక్షన్ సుందరీకరణ, గ్రీనరీ, డివైడర్ల ఏర్పాటు, విద్యుత్ దీపాలు, హైమాస్ట్ లైట్ల పనులు కొనసాగిస్తున్నారు. ఆయా పనులను ఇంచార్జి కలెక్టర్ పరిశీలించారు. పనుల్లో వేగం పెంచాలని, రానున్న శివరాత్రి వేడుకలకు సిద్ధం చేసి అందుబాటులోకి తీసుకురావాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సి పల్ డీవైఈఈ వాణి, ఏఈ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

### జిల్లాలో యూరియా కొరత లేదు..

జిల్లాకు అవసరమైన సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని, కొరత తరువాయి 2లో






# జన జాతర.. ఇక నూతన జాతర!

## గోదావరిఖనిలో రూ.7 కోట్లతో అభివృద్ధి

## సమ్మక్క, సారలమ్మ గద్దెల పునఃనిర్మాణం

ప్రజాపక్షం/గోదావరిఖని : గోదావరిఖని సమీపాన గోదావరినది ఒడ్డున ఉన్న సమ్మక్క, సారాలమ్మ గద్దెలను పునఃనిర్మించడంతోపాటు రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో పెట్టుకొని రూ.7 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు రామగుండం ఎమ్మెల్యే మక్కన్‌సింగ్ తెలిపారు. బుధవారం ఆయన తన సతిమణి మనాలి ఠాకూర్‌తో కలిసి జాతర ప్రదేశాన్ని సందర్శించారు. జాతర వద్ద చేపడ్తున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని దేవదాయ, ధర్మదాయశాఖ అధికారులను, జాతర నిర్వాహకులను ఆయన కోరారు. అమ్మవార్ల గద్దెలను పునః నిర్మించడం, పలు అభివృద్ధి పనులు చేపట్టడంతో ఈ యేడు జరిగే జాతర నూతనంగా కనిపించనున్నదన్నారు. సమ్మక్క సారాలమ్మ గద్దెల వద్ద ఎమ్మెల్యే దంపతులు పూజలు చేశారు. కాగా, సాయంత్రం రామగుండం నగరపాలక కార్యాలయంలో పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, దేవదాయశాఖలు, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సిఎల్, సింగరేణి, హెచ్‌కెఆర్ సంస్థల అధికారులు, జాతర కమిటి సభ్యులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతరకు వచ్చే భక్తులకు తాగునీరు, విడిది సదుపాయాలు, విద్యుత్తు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాల కల్పనలో ఏలాంటి ఇబ్బందులు ఉండకుండా చూడాలన్నారు. జాతరకు లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ జామ్ కాకుండా పార్కింగ్ సదుపాయాలు కల్పించాలన్నారు. సి.సి. కెమారాలు ఏర్పాటు చేసి భక్తుల రక్షణ, అగ్నిమాపక భద్రత చర్యలు చేపట్టాలన్నారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి అత్యవసర అంబులెన్సులు సమకూర్చాలన్నారు. పారిశుద్ధ్య సమస్య లేకుండా తరువాయి 2లో

# ఓటరు జాబితా ఫిర్యాదులు పరిష్కరించాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : మున్సిపాలిటీ ఓటర్ జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను ఫిర్యాదులను నిర్ణిత గడువులోగా పరిష్కరించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణా కుముదిని అధికారులను ఆదేశించారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మున్సిపల్ ఎన్నికల సన్నద్ధతపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 12వ తేదీ నాడు వార్డుల వారిగా ఫోటో ఎలక్టరోల్స్ జాబితా ప్రచురించడంతో పాటు, 13వ తేదీన డ్రాఫ్ట్ పోలింగ్ కేంద్రాలను ప్రచురిస్తామని వివరించారు. 16వ తేదీన తుది పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రచురించి, పోలింగ్ కేంద్రాల వారిగా ఫోటో ఎలక్టరోల్స్ ప్రచురిస్తామని అన్నారు. జిల్లాల వారీగా ఓటరు జాబితాలపై వచ్చిన తరువాయి 2లో

# విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యలో మెరుగైన ఫలితాలు

### జిల్లా ఎస్పీ మహేష్ బి గితే

ప్రజాపక్షం/ముస్తాబాద్ : ముస్తాబాద్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శ్రీ తిరుమల నర్సింగ్ హోమ్ వారి సౌజన్యంతో ముస్తాబాద్ మండల పరిధిలోని జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. వైద్య శిబిరానికి విద్యార్థుల నుండి విశేష స్పందన లభించగా, పెద్ద సంఖ్యలో విద్యార్థులు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. విద్యార్థులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే చదువులో



మంచి ఫలితాలు సాధించగలరని తెలిపారు. చిన్న వయస్సులోనే ఆరోగ్యంపై శ్రద్ధ తరువాయి 2లో

## గుండెపోటుతో సర్పంచ్ భర్త హఠాన్మరణం

### మంథని మండలంలో విషాదం

**ప్రజాపక్షం/ముత్తారం :** గుండెపోటుతో సర్పంచ్ భర్త హఠాత్ మరణం చెందిన సంఘటన పెద్దపల్లి జిల్లా మంథని మండలం మల్లారం గ్రామంలో బుధవారం విషాదం చోటు చేసుకుంది.ఇటీవలే నూతనంగా ఎన్నికైన సర్పంచ్ పొట్ల లక్ష్మి భర్త పొట్ల వెంకటి గుండె పోటుతో మృతి చెందిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. మంథని మండలం మల్లారం గ్రామ సర్పంచ్ పొట్ల లక్ష్మీ భర్త వెంకటి హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండేటువంటి వెంకటి మృతి చెందడం పట్ల గ్రామస్తులు కన్నీరు మున్నీరు అవుతున్నారు. సర్పంచ్ గా పొట్ల లక్ష్మి గెలవడంలో భర్త వెంకటి కీలకపాత్ర పోషించారు.

## నిధుల మంజూరుకు కృషి చేయాలి



**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** 2027 సంవత్సరంలో జరిగే పుష్కరాల కోసం వసతుల కల్పనకై నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరుతూ తాసిల్దార్ రమేష్‌కు గ్రామానికి చెందిన నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. సందర్భంగా బుధవారం తాసిల్దార్ కార్యాలయంలో కలిసి ప్రతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్యాతం వెంకట్ రెడ్డి, నరేష్ రెడ్డి, కిరణ్ ,ఉంగరాల సంతోష్ తదితరులున్నారు.

## మార్కెట్ కమిటీ సాధారణ సర్వసభ్య సమావేశం

**ప్రజా పక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో మార్కెట్ కమిటీ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు అధ్యక్షతన అధికారులు నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ కమిటీ ఆదాయ వ్యయాల గురించి చర్చించారు. అమ్మక్కపేట గ్రామంలో ప్రభుత్వ స్థలాన్ని మార్కెట్ యార్డుకు కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల క్రితం మార్కెట్ కమిటీ పాలకవర్గం జగిత్యాల జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించిన విషయాన్ని సమావేశంలో ప్రస్తావించారు. సమావేశం అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు ఆధ్వర్యంలో పాలకవర్గం తహసిల్దార్ బి.ఎస్.ఎస్ వరప్రసాద్‌కు కూడా వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఎలాల వెంకటరెడ్డి, మార్కెట్ కమిటీ సభ్యులు, చిట్యాల భూమారెడ్డి, బాధనకుర్తి భూమన్న, దామెర శ్రీనివాస్, బొల్లావేణ శంకర్ ,తదితరులు పాల్గొన్నారు.

## శివరాత్రిలోగా జంక్షన్ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

లేదని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ప్రస్తుతం 2వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. ఇప్పటివరకు జిల్లాకి 21 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కాగా, ఇప్పటి దాకా 12 వేల మెట్రిక్ టన్నులు రైతులకు పంపిణీ చేశామని తెలిపారు. మరో రెండు వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వెల్లడించారు. అవసరాన్ని యూరియా సరఫరా కూడా క్రమం తప్పకుండా అందుతుందని స్పష్టం చేశారు యూరియా పంపిణీపై సంబంధిత అధికారులు, వ్యవసాయ శాఖ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారని తెలిపారు. కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ఎవరైనా యూరియా సరఫరాలో సమస్యలు ఎదుర్కొంటే సమీప వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. అవసరానికి మించి యూరియా కొనుగోలు చేయకుండా, శాస్త్రీయ పద్ధతిలో వినియోగించాలని రైతులను ఇంచార్జి కలెక్టర్ కోరారు. కొందరు సోషల్, ఇతర మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న అసత్య ప్రచారాలు నమ్మవద్దని సూచించారు. పంటల సాగుకు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు.

## విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే విద్యలో మెరుగైన ఫలితాలు

(మొదటి పేజీ తరువాయి)

వహించడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ఎంతో అవసరమని సూచించారు. ఈ వైద్య శిబిరంలో విద్యార్థులకు సాధారణ వైద్య పరీక్షలు,కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వైద్య సూచనలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శ్రీ తిరుమల నర్సింగ్ హోమ్ యాజమాన్యంతో పాటు ఇందులో పాల్గొన్న వైద్య నిపుణులు, సిబ్బందికి, సురభి వైద్య విజ్ఞాన సంస్థ సిబ్బంది, జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సి.ఐ మొగిలి, ఎంఈఓ రాజిరెడ్డి, ఎస్.ఐ గణేష్, డాక్టర్లు చంద్రశేఖర్ రావు, శ్రీకాంత్, అనురాధ, స్రవంతి, సురభి వైద్య విజ్ఞానసంస్థ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బుధవారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్లో పోలీస్ అధికారులకు, సిబ్బందికి శ్రీ తిరుమల నర్సింగ్ హోమ్ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ... ప్రజలకు నిరంతరం సేవలందించే పోలీసుల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, పోలీసులు ఆరోగ్యంగా వున్నప్పుడే సమాజానికి మెరుగైన సేవలు అందించగలరని, ఆరోగ్య పరిరక్షణ కోసం పోలీసులు ఆరోగ్య పరీక్షలకై సమయాన్ని కేటాయించాలన్నారు.

## మహిళా సంఘాల రుణాల రికవరీపై దృష్టి

### జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మహిళా సంఘాల రుణాల రీకవరిపై ప్రత్యేక దృష్టి సారించి, ఫిబ్రవరి 15 నాటికి పెండింగ్ రుణాల రీకవరి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సెర్ప్ కార్యకలాపాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ లక్ష్యంలో 90 శాతం పూర్తి చేశామని తెలిపారు. ధర్మారం, ఎలిగేడు ,ముత్తారం, శ్రీరాంపూర్‌లో రుణాల పంపిణీ తక్కువగా ఉందని, ఆ మండలాల్లో రుణాల పంపిణీ పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు. జిల్లాలోని చాలా మండలాల్లో ఆర్థికంగా రుణ లక్ష్యాలను పూర్తి చేసినప్పటికీ, స్వశక్తి మహిళా సంఘాల సంఖ్యలో చేరుకోలేదని, నిర్దేశించుకున్న లక్ష్యం ప్రకారం స్వశక్తి మహిళా సంఘాల సంఖ్య తప్పనిసరిగా చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. మండలాల్లో అవసరమైన చోట నూతన మహిళా సంఘాలను ఏర్పాటు చేసి రుణ లక్ష్యాలు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. మహిళా సంఘాల రుణాల రికవరి ఎక్కడా డిఫాల్ట్ ఉండటానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. మహిళా సంఘాల సోమ్ము ఎక్కడా దుర్వినియోగం చేయవద్దని అన్నారు. జనవరి చివరి నాటికి ఎన్.పి.ఏ మన జిల్లాలో అతి తక్కువ ఉండాలని, 100% రికవరీ వైపు దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీహబ్‌ను వచ్చే వారం ప్రారంభించే అవకాశం ఉందని, ఆసక్తి గల మహిళలకు అవసరమైన శిక్షణ అందించేందుకు రిజిస్టర్ చేయాలని, వీరు రెగ్యులర్ గా శిక్షణ తీసుకునేలా చూడాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, అదనపు డిఆర్డిఓ రవీందర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జగిత్యాల మున్సిపల్ పీఠంపై గులాబీ జెండా ఎగరవేయాలి



**ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ :** జగిత్యాల జిల్లా బి ఆర్ యస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జగిత్యాల జిల్లా బి.ఆర్.యస్ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జిల్లా మాజీ జడ్పీ ఛైర్ పర్సన్ దావ వసంత సురేష్ జగిత్యాల పట్టణ ముఖ్య నాయకులతో బుధవారం రోజున మున్సిపల్ ఎన్నికల గురించి సమావేశంలో పాల్గొన్నారు. వచ్చే మునిసిపల్ ఎన్నికల గురుంచి సమయాత్తం కావాలని, కేసీఆర్ కి, బి.ఆర్.యస్ పార్టీకీ ప్రజల్లో నమ్మకం ఉందని మన ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వారన్నారు. పార్టీ పక్షాన అండగా ఉంటామని తెలిపారు. జగిత్యాల మునిసిపల్ ఎన్నికల్లో బి.ఆర్.యస్ పార్టీ అభ్యర్థుల గెలుపుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలనీ, అందరినీ సమన్వయం చేసుకోని ముందుకు వెళ్లాలని జగిత్యాల మున్సిపల్ పీఠంపై గులాబీ జెండా ఎగరవేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా బి.ఆర్.యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## చిన్నారులకు అండగా...

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** కన్న పిల్లలను కంటికి రెప్పలా కాపాడాల్సిన తల్లిదండ్రులే ఒక్కొక్కరుగా దూరమవుమైపోయారు. జగిత్యాల రూరల్ మండలం కల్లెడ గ్రామంలో ఈ మధ్య చోటుచేసుకున్న ఘటన అభం శుభం తెలియని ముగ్గురు పిల్లలు అనాథలు కాగా వారికి మేము అండగా ఉంటాం అని జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామ గ్రామ క్రేజీ బాయ్స్ యూత్ యువకులు ముందుకొచ్చారు. వారికి ప్రస్తుతం తినడానికి 40 కేజీల బియ్యం, 8000 రూపాయలు బ్యాంకు లో ఫిక్స్ డిపాజిట్ చేస్తామని తెలిపారు. కల్లెడ గ్రామ నాయకులు మాజీ ఎంపీటీసీ పరశురామ్ పిల్లలకు మూడు రోజుల వరకు బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేస్తానని హామీ ఇచ్చారని అనంతారం గ్రామ క్రేజీ బాయ్స్ యూత్ అధ్యక్షుడు సుభాన్ తెలిపారు. ఇకముందు కూడా అనాథలైన ఆ పిల్లలకు తమ వంతు సహకారం అందిస్తామని అనంతారం గ్రామ క్రేజీ బాయ్స్ యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతారం గ్రామ క్రేజీ బాయ్స్ యూత్ సభ్యులు కల్లెడ మాజీ ఎంపీటీసీ పరశురామ్, నవీన్, వంశీ, శ్రీనివాస్, రాకేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## జన జాతర.. ఇక నూతన జాతర!

(మొదటి పేజీ తరువాయి)

చూడాలన్నారు. అమ్మవార్ల ఆగమనం, భక్తుల దర్శనాల సమయాల్లో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేపట్టాలన్నారు. అన్ని విభాగాల వారు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి కమిషనర్ జె.అరుణశ్రీ, గోదావరిఖని ఎసిపి మడత రమేష్, దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సుప్రియ, ఆర్డీవో గంగయ్య, అదనపు కమిషనర్ మారుతి ప్రసాద్, ఈఈ రామన్, ఎన్పీడీసీఎల్ డి.ఈ. ప్రభాకర్, ఎ.డి.ఈ. వెంకటేశ్వర్లు, జాతర ఈవో కాంతారెడ్డి, కమిటి ఛైర్మన్ శ్రీనివాస రెడ్డి, సి.ఐ.లు ప్రసాదరావు, ఇంద్రసేనారెడ్డి, ప్రవీణ్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

(మొదటి పేజీ తరువాయి)

శిఖరాలు అధిరోహిస్తారని పేర్కొన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లి మహిళల ఆలోచనలు విన్నట్లు వివరించారు. గ్రామీణ ప్రాంత మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ఈ ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశం. ఈసారి పంచాయతీ ఎన్నికల్లో 25 మంది మహిళలకు ప్రోత్సాహం అందించగా 18 మంది నామినేషన్ దాఖలు చేశారని, ఇందులో 11 మంది మహిళలు వార్డు సభ్యులుగా ఎన్నికైనట్లు ఫౌండేషన్ సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ఫిర్యాదులను పరిష్కరించాలి

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరాల వివరాలను సమీక్షించారు.అభ్యంతరాల ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా పరిశీలించి, పరిష్కరించాలన్నారు. 2025 సంవత్సరం సంబంధించి 3వ సప్లిమెంటరీ ఓటరు జాబితా నవంబర్ 15న విడుదలైందని, దాని ప్రకారం పట్టణాలలో వార్డుల వారీగా డ్రాఫ్ట్ ఓటరు జాబితా జనవరి 1న విడుదల చేశామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, ఓటర్ జాబితాపై వచ్చిన అభ్యంతరాల ఫిర్యాదులను చర్చించారు. ఫిర్యాదులను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకళ్యాణి, నిర్మల్, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్లు జగదీశ్వర్ గౌడ్, సుందర్ సింగ్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు ఇందిరా మహిళ శక్తి చీరల పంపిణీ

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాలలో ఐకెపి, ఆయా గ్రామాల సర్పంచుల ఆధ్వర్యంలో మహిళలకు ఇందిర మహిళ శక్తి చీరల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తహసిల్దార్ బిఎస్ఎస్ వరప్రసాద్ ఎంపీడీవో సిహెచ్ గణేష్ హాజరై మహిళలకు చీరలు పంపిణీ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళ సంఘాలో లేని మహిళలకు కూడా చీరలు పంపిణీ చేయడం జరుగుతుందని తహసిల్దార్, ఎంపీడీవో తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు బద్దం గోపి, ఫోన్ కంటి చిన్న వెంకట్, ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్, ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ఏపీఎం శంకర్, పంచాయతీ సెక్రెటరీ రామకృష్ణ, సీసీలు సాయందర్. పురుషోత్తం, రాజేందర్, త్రివేణి, పసునూరి కళా, ప్రవళిక, ప్రసన్న, మహిళలు పాల్గొన్నారు.



## ఉపసర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడిగా విజేందర్




**ప్రజాపక్షం/వీణవంక :** వీణవంక మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా వల్భాపూర్ ఉపసర్పంచ్ నామిని విజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపసర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, ఎండి సాహెబ్ హుస్సేన్, సర్పంచ్ అందె శ్రీమతి, జడల శ్రీకాంత్, అప్పల తిరుమల, ఉపసర్పంచులు ఉయ్యాల రాజు, మడ్డి మహేష్, గాజుల రవి, గొల్లపల్లి అనిల్, మాదాసి సంపత్, ఇల్లందకుంట దేవస్థానం ధర్మకర్త జున్నుతుల మధుకర్‌రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్ట్స కళాశాలను సందర్శించిన రిజిస్ట్రార్



**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ :** శాతవాహన విశ్వవిద్యాలయంలో నూతనంగా రిజిస్ట్రార్ ఉత్తర్వులు అందుకున్న ఆచార్య సతీష్‌కుమార్ బుధవారం ఆర్ట్స కళాశాలను సందర్శించి తరగతులు ఎలా జరుగుతున్నాయో పరిశీలించారు. మొదటి సెమిస్టర్ విద్యార్థులకు మొదటి ఇంటర్నల్ పరీక్షలు జరుగుతుండగా వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశ్వవిద్యాలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధిపథంలో నడిపేందుకు విద్యార్థులు, అధ్యాపకులు, పరిపాలనా అధికారులు ఒకతాటిపై రావాలని విశ్వవిద్యాలయాన్ని మనం అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. అందులో వైస్ ప్రిన్సిపాల్ డా.అబ్రారుల్ బాఖీ, డా.ప్రదీప్ రాజ్, హరికృష్ణ ఉన్నారు. పిజి మొదటి సెమిస్టర్ మొదటి ఇంటర్నల్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి.

## జాగృతిలో చేరిన మాజీ వైస్ ఎంపీపీ

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట :** తెలంగాణ జాగృతిలో ఎల్లారెడ్డిపేట మాజీ వైస్‌ఎంపీపీ భాస్కర్‌గౌడ్ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలైన కవితక్క చేతులమీదుగా కండువా కప్పి ఆహ్వానించారు. బుధవారం బీఆర్‌ఎస్ యువజన విభాగంకు చెందిన పొందుర్తి ఉమేశ్ ,వర్ధ సతీష్ సైతం పార్టీని వీడి తెలంగాణ జాగృతికి జంప్ అయ్యారు. కవిత శాలువాతో వారిని సాదరంగా ఆహ్వానించారు. జాగృతిని సిరిసిల్లలో బలోపేతం చేయాలని కోరినట్లుగా సమాచారం. అదే విధంగా బీఆర్‌ఎస్‌లో చురుగ్గా పనిచేసిన గుర్రాల రాజిరెడ్డి సైతం కాంగ్రెస్ గూటిలోకి చేరి సిరిసిల్ల కాంగ్రెస్ ఇంచార్జీ కేకే మహేందర్‌రెడ్డిచే కండువా కప్పుకున్నారు.

# రోడ్డు నిబంధనలను పాటించి ప్రమాదాలు అరికట్టాలి

### హుజురాబాద్ ఏసిపి మాధవి



**ప్రజాపక్షం/శంకరపట్నం :** రోడ్డు నిబంధనలను పాటిస్తూ ప్రమాదాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని హుజురాబాద్ ఏసిపి మాధవి అన్నారు. బుధవారం రోడ్డు భద్రతావారోత్సవాల్లో భాగంగా నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉపసర్పంచ్‌లు వారి కుటుంబాలతో పోలీస్‌స్టేషన్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్భంగా ఏసిపి మాట్లాడుతూ రోడ్డు భద్రతా వారోత్సవాలను ప్రతి యేటా నిర్వహించి వాహనదారులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు హెల్మెట్, సీటు బెల్టు తప్పకుండా ధరించాలని, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్స్ పత్రాలను తీసుకెళ్లాలని చెప్పారు. కండీషనల్‌లో ఉన్న వాహనాలనే డ్రైవింగ్ చేయాలన్నారు. వాహనాలలో ప్రయాణించేటప్పుడు మద్యం సేవించడం, సెల్‌ఫోన్ చూడడం, నిద్రలేమి వంటి కారణాలో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. గ్రామాల్లో వీధి లైట్ల ఏర్పాట్లు, గ్రామకూడలిలో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించకూడదని చెప్పారు. నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడుపుతామన్నారు. వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హుజురాబాద్ రూరల సిఐ పులి వెంకట్, ఎస్సై శేఖర్‌రెడ్డి, సర్పంచులు, ఉపసర్పంచులు తదితరులున్నారు.

# దుర్శేడ్‌లో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు




**ప్రజాపక్షం/కొత్తపల్లి :** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా 7వ రోజు అవగాహన కార్యక్రమాన్ని కరీంనగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్ రాజీవ్ రహదారిపై నిర్వహించారు. జిల్లా రవాణాశాఖ కరీంనగర్, ట్రాఫిక్ పోలీసుల ఉమ్మడి నిర్వహణలో రహదారులపై మితిమీరిన వేగంతో నడుస్తున్న వాహనాలతో పెద్ద మొత్తంలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించడానికి కరీంనగర్ రామగుండం స్టేట్ హైవే యన్‌హెచ్1పై వాహనాల చోదకులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టినట్లు డిటిసి పురుషోత్తం తెలిపారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలను నడపడం చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. శిక్షార్హమే కాకుండా ప్రాణాంతకమూ అని చెప్పారు. చట్ట నిబంధనలను వాహనాల చోదకులకు తెలియజేశారు. ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు రేణిగుంట టోల్‌ప్లాజ్ కన్నా ముందు నుస్తులాపూర్ దగ్గర స్టేట్ రహదారిపై జరిగిన ఈ తనిఖీలో మితిమీరిన వేగంతో పయనించిన పది వాహనాలకు ఫైన్ విధించడంతో పాటు అధిక వేగ నియంత్రణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ పి.పురుషోత్తం, ఆర్‌టిఏ మెంబర్ పడాల రాహుల్, డిటివో శ్రీకాంత్ చక్రవర్తి, రక్షణ రోడ్ సేఫ్టీ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ డా.నీలం సంపత్, ట్రాఫిక్ యస్ఐ సురేష్‌వర్మతో పాటు రవాణాశాఖ, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సంబరాలు



**ప్రజాపక్షం/కరీంనగర్ :** తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొరివి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో నగరంలోని తెలంగాణ చౌక్‌లో బాణాసంచా కాల్చి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ, మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ టిపిసిసి, ఎస్సీ సెల్ విభాగం రాష్ట్ర అధ్యక్షులుగా నియమించబడడం సంతోషదాయకమనీ, సత్యనారాయణ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షునిగా ఆరు సంవత్సరాలుగా పార్టీ పగ్గాలు చేపట్టి పార్టీ పటిష్టత కోసం ఎంతగానో కృషి చేశారని, గతంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో చేసిన ప్రజా వ్యతిరేక కార్యకలాపాలను ఎండగట్టి, ప్రజలకు చేరువైనారని, నేడు మానకొండూరు శాసనసభ్యులుగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా ప్రజా పాలన ఫలాలను ప్రజలకు చేరవేస్తున్నారని, రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నియామకమైన సత్యనారాయణకి శుభాకాంక్షలు తెలుపుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి తాజ్, బానోతు శ్రావన్ నాయక్, అహమ్మద్ అలీ, వెన్నం రజిత రెడ్డి, మూల రవీందర్ రెడ్డి, కుర్ర పోచయ్య, నిహాల్, కర్ర రాజశేఖర్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అబ్దుల్ రహమాన్, పంజాల కృపా సాగర్, సలీముద్దీన్,కుంభాల రాజకుమార్, దన్ను సింగ్, కొమ్రుద్దీన్, అమీర్, స్వప్న శ్రీ, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరాంనగర్‌కాలనీలో యుజిడి పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/కొత్తపల్లి :** శాతవాహన యూనివర్సిటీ ఎదురుగాగల శ్రీరాంనగర్ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించబోయే యుజిడి నిర్మాణానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సంధర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కొన్ని ప్రాంతాలలో అసలే డ్రైనేజీ వ్యవస్థలేక దోమలు, దుర్గంధంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి కాలనీలకు ప్రాధాన్యతనిచ్చి డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. డ్రైనేజీ నిర్మాణం అనంతరం రోడ్డు నిర్మాణం చేపడుతామని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో బోనాల శ్రీనివాస్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, వరాల నర్సింగం, అస్తపురం రమేష్, అస్తపురం తిరుమల, మల్లిఖార్జున్, ఊరడి లత, మాధవరావు, నవీన్‌రావు, రవీందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సైకిళ్లు

**ప్రజాపక్షం/కోనరావుపేట :** రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని కనగర్తి, మామిడిపల్లి, బావుసాయిపేట, జెడ్పిహెచ్ఎస్ పాఠశాలలో బుదవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మోదీ కానుకగా కేంద్ర మంత్రి బండి సంజయ్ పేద విద్యార్థులకు సిఎస్ఆర్ నిధులతో పంపిన సైకిళ్లను బిజెపి మండల అద్యక్షుడు ధర్మారం గ్రామ సర్పంచ్ మిర్యాల్‌కార్ బాలాజీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు షేక్ యాస్మిన్ ఫిరోజ్ పాషా, మల్యాల స్వామిదాస్, లక్ష్మారెడ్డి, ప్రధానోపాద్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు, బిజెపి నాయకులు కోల కిష్టస్వామి, డిస్ట్రిక్ట్ కౌన్సిల్ మెంబర్ గొట్టె రామచంద్రం, మాజీ సర్పంచ్ జవాజి తిరుపతి గౌడ్, డాక్టర్ మాలయ్య, గట్టు గిరి, పిల్లి మలేవేని విజయ్, వెంకట్, దుర్గం తిరుపతి పాల్గొన్నారు.



## ప్రజాపక్షం క్యాలెండర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/కరీంనగర్ :** ప్రజాపక్షం దినపత్రిక 2026 సంవత్సరం కలర్ క్యాలెండర్‌ను కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాపక్షం దినపత్రిక ప్రతి అక్షరం ప్రజల కోసం అన్నట్లుగా అనునిత్యం ప్రజల పక్షాన నిలుస్తుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాపక్షం స్టాఫ్ రిపోర్టర్ చిప్పరి వెంకట రాజు, రిపోర్టర్లు బి.సురేష్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## జిపి పాలకవర్గానికి సన్మానం



**ప్రజాపక్షం/గంగాధర :** గంగాధర మండలంలోని ఒద్యారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలలో విద్యార్థులతో పరిచయ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులకు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు వార్డు వారీగా గ్రామపంచాయతీ కార్యాలయానికి సమస్యలను వివరించారు. పారిశుద్ధ్యం, నీటి సౌకర్యం, స్ట్రీట్ లైట్లు వెలగకపోవడం వంటి సమస్యలను తెలియజేశారు. కార్యక్రమంలో ఎంఈవో ప్రభాకర్‌రావు, గౌరీ రమేష్, పంచాయతీ కార్యదర్శి రేణుక, కారోబార్ ఉదయ్ కుమార్, సర్పంచ్ చౌడబోయిన ఉమా మధు, ఉపసర్పంచ్ పండుగ గగన్ కుమార్, వార్డు సభ్యులు అనంతరావు, అశోక్ కృష్ణ, మాధవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో సెయింట్‌పాల్స్ విద్యార్థులు

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్ :** గోజు ర్యూ కరాటే డో అసోసియేషన్ తెలంగాణ ఆద్వర్యంలో ఈ నెల 4న కరీంనగర్‌లోని రెడ్డి ఫంక్షన్ హాలు(ఆర్‌బివిఆర్‌ఆర్) సీతారాంపూర్‌లో నిర్వహించిన తెలంగాణ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్‌లో వావిలాలపల్లి సెయింట్‌పాల్స్ హైస్కూల్ విధ్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈ పోటీల్లో విధ్యార్థులు అబిజ్ఞాన్, క్షేత్రసౌందర్య, కె.గీతిక, ఎ.ప్రణుష్ తేజ్, టి.నిహాన్‌వర్మ, జి.శ్రేష్ట స్వర్ణ పతకాలు సాధించగా వి.పూజిత రజత పతకం, మొహమ్మద్ అర్మానుద్దీన్ కాంస్య పతకాలు సాధించినట్లు పాఠశాల చైర్మన్ రాజకుమార్ తెలిపారు. ఈ సంధర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ లీనా ప్రియదర్శిని విజేతలను అభినందిస్తూ విద్యతో పాటు క్రీడల్లోనూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. చైర్మన్ మాట్లాడుతూ విధ్యార్థులు, తల్లిదండ్రులు శిక్షకులను అభినందిస్తూ ఇలాంటి విజయాలు పాఠశాల సమగ్ర అభివృద్ధికి నిదర్శనమని తెలిపారు.

## చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని దమ్మన్నపేట ,లక్ష్మీపూర్ 2 గ్రామంలోని అంగన్వాడి కేంద్రాలలో గ్రామ సర్పంచ్ ,ముదాం గౌతమి జానారెడ్డి ,కాసం రాజశేఖర్ లు పాల్గొని చిన్నారులకు అన్నప్రాసన,అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఆరోగ్య సూత్రాల మీద ఆకు కూరలు, కూరగాయలు,గుడ్లు వాటి ప్రాధాన్యత బలమైన ఆహార పోషకాల విలువలపై వివరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిన్నారులకు అంగన్వాడి కేంద్రం అమ్మ ఒడిలాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కాసం రాజశేఖర్ ఉపసర్పంచ్ సంఘం రజిత తిరుపతి, వార్డు సభ్యులు మానాల మహేందర్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు స్వాతి, అంగన్వాడి టీచర్లు ఎం.తిరుమల ఎం.స్వప్న, సైన్ల రజిత ,ఆయా రజిత ,ఆశ లక్ష్మి ,పిల్లలు, తల్లులు గర్భిణీలు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఖర్చుల వివరాలు సమర్పించాలిః ఎంపిడిఒ



ప్రజాపక్షం / జన్నారం : జన్నారం మండలంలో జరిగిన సర్పంచ్, వార్డు ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు తమ ఎన్నికల ఖర్చుల వివరాలను తప్పనిసరిగా సమర్పించాలని ఎంపిడిఒ ఉమర్ షరీఫ్ తెలిపారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోటీ చేసిన వ్యక్తులు ఖర్చుల వివరాలను అధికారులకు అందించాలని, ఎన్నికల్లో గెలిచినా ఓడినా అభ్యర్థులు శుక్రవారంలోగా ఖర్చుల వివరాలను తమకు అందజేయాలని కోరారు.

## బిసి సబ్ ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలి



ప్రజాపక్షం/జన్నారం : బిసి సబ్ ప్లాన్ అమలు చేసి చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా విభాగం అధ్యక్షుడు ఎండి ఇలియాస్ కోరారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ఇంచార్జ్ ఎంఆర్‌ఓ రామ్మోహన్ కు ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న, జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. బిసిలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టేందుకు సబ్ ప్లాన్ అమలు అత్యవసరమని పేర్కొన్నారు.

## బిజెవైఎం మండల నూతన కమిటీ ఎన్నిక



ప్రజాపక్షం/జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండల బిజెవైఎం నూతన కమిటీని మండల అధ్యక్షుడు కందుల రమేష్ ఆధ్వర్యంలో బుధవారం నియమించారు. ఉపాధ్యక్షుడిగా అక్షయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా మహేష్, కార్యదర్శిగా రాజు, సోషల్ మీడియా సభ్యుడిగా రంగు రాకేష్, కార్యవర్గ సభ్యులుగా కొండపర్తి వేణు, అనిల్, పుట్టకొప్పుల నరేష్, అనిల్‌లను ఎన్నుకున్నారు ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు తెలియజేసి మండలంలో బిజెపి బలోపేతానికి దోహదపడతామని పేర్కొన్నారు.

# కంకర రోడ్డును బాగుచేయండి



ప్రజాపక్షం / సిర్పూర్ (టి) : మండల పరిధిలోని కంకర రోడ్డును వెంటనే బాగుచేయాలని కంకర రోడ్డు వలన దుమ్ము ధూళితో విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులను డిమాండ్ చేశారు. పాఠశాలకు వెళ్లే ప్రధాన మార్గంగా ఉన్న కంకర రోడ్డుపై వాహనాల రాకపోకల వల్ల దుమ్ము దట్టంగా ఎగిసిపడుతుండడంతో విద్యార్థులు, ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ప్రత్యేకించి ఉదయం, సాయంత్రం వేళల్లో దుమ్ము కారణంగా విద్యార్థులకు శ్వాస సమస్యలు, కంటి మంటలు వస్తున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు, కాలినడకన వెళ్లే విద్యార్థులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందని, వాహనాలు వెళ్లేటప్పుడు కంకర రాళ్లు తగిలి గాయాలవుతున్నాయని తెలిపారు. గతంలో పలుమార్లు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని, అధికారులు తక్షణమే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

# గంగపూర్ జాతర ఏర్పాట్లపై ఎస్‌పి నితికా పంత్ సమీక్ష



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : గంగపూర్ జాతరను శాంతియుతంగా, సక్రమంగా నిర్వహించేందుకు కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ఎస్‌పి నితికా పంత్ బుధవారం గంగపూర్ ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ ఆలయ పరిసరాల్లో బందోబస్తు, రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ మళ్లింపులు, పార్కింగ్ నిర్వహణపై అధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు. జాతర సమయంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని, శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఆలయ కమిటీ సభ్యులు, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ జాతరను విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్, రెబ్బెన సిఐ సంజయ్, ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

# ఐదవ రోజు మున్సిపల్ కార్యాలయ దిగ్బంధం



ప్రజాపక్షం / కాగజ్ నగర్ : కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణ మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె 17వ రోజుకు చేరుకోగా మున్సిపల్ కార్యాలయం దిగ్బంధం ఐదవ రోజు కొనసాగుతోంది. ఐదు నెలల పెండింగ్ వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలు చెల్లించాలని కోరుతూ కార్మికులు చేస్తున్న ఆందోళనకు ప్రజాసంఘాల నాయకులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ కాగజ్ నగర్ మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెల వేతనాలతో పాటు సుమారు రెండు కోట్ల పిఎఫ్, ఇఎస్ఐ బకాయిలను వెంటనే ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అధికారులు స్పందించకుంటే జనవరి 3న ప్రారంభమైన ముట్టడిని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ వెంటనే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నిల్వ ఉంచిన ఆహారం విక్రయిస్తే కఠిన చర్యలు



ఫుడ్ ఇన్ స్పెక్టర్ వాసురాం

ప్రజాపక్షం / జన్నారం :ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే ఉపేక్షించేది లేదని, కల్తీ నూనెలు వాడితే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ ఇన్స్పెక్టర్ వాసురాం హెచ్చరించారు. మంచిర్యాల జిల్లా జన్నారం పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలలో బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్కువ కాలం నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను, పాడైపోయిన వస్తువులను విక్రయించరాదని స్పష్టం చేశారు. లాభాపేక్ష కోసం నాణ్యత లేని సరుకులు వాడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణంలోని స్వీట్ హౌస్‌లు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రత పాటించాలని సూచించారు. వంట గదులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని, వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని మాత్రమే అందించాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి వ్యాపారం చేస్తే దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా అనుమానం ఉన్న కొన్ని ఆహార పదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్ కు పంపినట్లు వెల్లడించారు. ల్యాబ్ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

# గోదావరి జలాలను సేకరించిన మెస్రం వంశీయులు



ప్రజాపక్షం / జన్నారం : ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ గ్రామంలో జరిగే నాగోబా జాతర అంకురార్పణ కోసం మెస్రం వంశీయులు గోదావరి గంగా జలాలను సేకరించారు. బుధవారం మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కలమడుగు శివారులో ఉన్న గోదావరి తీరానికి పాదయాత్రగా చేరుకొని వారు పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించి పవిత్ర జలాలను సేకరించి తిరుగు ప్రయాణం అయ్యారు. ఈ కార్యక్రమంలో మెస్రం వంశీయులు, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ సొంత నిధులతో రోడ్ల మరమ్మతులు



ప్రజాపక్షం / తిర్యాణి : అధికారుల నిర్లక్ష్యంతో దెబ్బతిన్న రోడ్లకు కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం మంగి సర్పంచ్ రాయి సిడం వినోద్ తన సొంత నిధులతో మరమ్మతులు చేయించారు. హాస్టల్ గూడ నుండి పటేల్ గూడ, పటేల్ గూడ నుండి గుట్టగూడ వెళ్లే మార్గాల్లో రోడ్లు గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, అంబులెన్స్ రాకపోకలకు ఆటంకం కలగడంతో పాటు వాహనాలు తరచూ చెడిపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో సర్పంచ్ స్పందించి బుధవారం తన సొంత ఖర్చులతో మొరం పోయించి మరమ్మతులు చేయించారు. ప్రజల కష్టాలు చూడలేకే తాను ఈ పని చేశానని సర్పంచ్ తెలిపారు. సర్పంచ్ చొరవను గ్రామస్తులు ప్రశంసించారు.

## ప్రభుత్వ పాఠశాలలను సందర్శించిన ప్యానెల్ బృందం



ప్రజాపక్షం / సిర్పూర్ (టి) : కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టి) మండలంలోని గోవిందాపూర్, మాకిడి, లింబుగూడ, రావణపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను బుధవారం విద్యాశాఖ ప్యానెల్ బృందం సందర్శించి విద్యా ప్రమాణాలను పరిశీలించింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలల పర్యవేక్షణలో భాగంగా ఈ బృందం పాఠశాలల్లోని బోధన విధానం, మౌలిక వసతులను సమగ్రంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల పనితీరు, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై వారు సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని అంచనా వేసేందుకు ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ లక్ష్మణ్, సభ్యులు కిరణ్‌కుమార్, దామోదర్, ప్రధానోపాధ్యాయులు రజిత, శ్రావణి, ఉపాధ్యాయులు జలపతి, రాము, కార్తీక్, సరిత పాల్గొన్నారు.

## కమీషన్లు రావనే కాంగ్రెస్ వ్యతిరేకత

బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి



ప్రజాపక్షం/మంచిర్యాల : ఉపాధి హామీ పనుల్లో కమీషన్లు రావనే ఉద్దేశంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన విబి జి రామ్ జి బిల్లును కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించడం సిగ్గుచేటని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి విమర్శించారు. బుధవారం మంచిర్యాల జిల్లా బిజెపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదలకు మరిన్ని పని దినాలు కల్పించి ఆదాయాన్ని పెంచాలనే లక్ష్యంతో కేంద్రం ఈ బిల్లును ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు బిల్లుపై అవగాహన లేకుండా మాట్లాడుతూ ప్రజల్లో తప్పుడు అపోహలు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. గతంలో ఉన్న 100 పని దినాలను 125 రోజులకు పెంచి గ్రామీణప్రాంత ప్రజలకు ఆర్థిక లబ్ధిచేకూర్చేలా బిల్లును రూపొందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, గోలి రాము, రవీందర్ రావు, సత్తన్న, శ్రీదేవి, కమలాకర్ రావు, సతీష్ రావు, తిరుపతి, వెంకట రమణ రావు, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, రమేష్, శ్రీశైలం, స్వామి రెడ్డి, హరిగోపాల్, రవి, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో పారదర్శకతే లక్ష్యం



**ప్రజాపక్షం/ఎడపల్లి:**ఓటరు జాబితాలో పారదర్శకతను పెంచేందుకు ఎలాంటి తప్పులకు తావు లేకుండా పక్కగా రూపొందించేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో ఆదేశించారు. బుధవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామంలో ఎస్ఐఆర్ 2025కార్యక్రమంలో భాగంగా ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న ఓటరు జాబితాను 2002 నాటి ఓటర్ల జాబితాతో అనుసంధానం చేసే ప్రక్రియను క్షుణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పాత రికార్డులతో పోల్చి చూడటం ద్వారా ఓటరు సమాచారాన్ని ఖచ్చితంగా ధ్రువీకరించవచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రక్రియ వల్ల బోగస్ ఓట్లు తొలగిపోవడమే కాకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పరిశీలనలో భాగంగా సబ్ కలెక్టర్ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. అర్హులైన ఓటర్ల సంతాన వివరాలను సేకరించి, వాటిని రికార్డులలో నిక్కచ్చిగా నమోదు చేయాలని, ఒకే వ్యక్తి వివరలు రెండు చోట్ల ఉండకుండా చూసేందుకు, స్వీయ సంతాన గుర్తింపు ప్రక్రియను పక్కాగా అమలు చేయాలని సూచించారు. మ్యాపింగ్‌లో ఏవైనా పొరపాట్లు జరిగి ఉంటే వెంటనే వాటిని గుర్తించి సరిదిద్దాలని అన్నారు. భవిష్యత్తులో ఎన్నికల నిర్వహణను మరింత పారదర్శకంగా మార్చేందుకు ఈ ప్రక్షాళన ప్రక్రియ దోహదపడుతుందని అధికారులు బాధ్యతయుతంగా వ్యవహరించి జాబితాను దోషరహితంగా తీర్చిదిద్దాలని సబ్ కలెక్టర్ వికాస్ మహాతో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి, రెవెన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

## చెత్త తొలగింపు



**ప్రజాపక్షం/బాల్కొండ:**మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలోని బ్లేడ్ ట్రాక్టర్ సాయంతో చెత్తను తొలగించినట్లు సర్పంచ్ గుండేటి మోహన్ తెలిపారు. రోడ్ల వెంబడి పేరుకుపోయిన చెత్తను శుభ్రం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మూగ భోజన్న, పంచాయతీ కార్యదర్శి దేవేందర్, సభ్యులు కుంట శేఖర్, రాజేందర్, లక్ష్మి, గంగు, గంగుబాయి, నాగేష్, సాగర్, వేణు, ప్రదీప్ పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధే లక్ష్యం

**ప్రజాపక్షం/లక్ష్మ ణచందా:**గ్రామ అభివృద్ధి లక్ష్యంగా ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అందరం సమన్వయంతో ముందుకు సాగుతామని గ్రామ సర్పంచ్ చింతకింది ముఖేష్ బుధవారం పొట్ట పెల్లి గ్రామసభలో పాల్గొని మాట్లాడారు.గ్రామంలో చేపట్టే వివిధ అభివృద్ధి పనుల గురించి తీర్మానం చేశారు. ఉప సర్పంచ్ పోతుగంటి రవీందర్ గ్రామ కార్యదర్శి ప్రియాంక రెడ్డి వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



**ప్రజాపక్షం/నేరడిగొండ:** మండలంలోని కుంటాల గ్రామంలో గల ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 10 లక్షల రూపాయలతో ప్రహరీ గోడ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్, భూమిపూజా చేశారు అనంతరం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ పాఠశాలక అడిగిన వెంటనే విద్యార్థులకు కావలసిన సౌకర్యాలు కల్పించామని,అందులో భాగంగా ప్రోగ్రాంలకు స్టేజ్ లేదని కోరితే తక్షణమే స్టేజి నిర్మించారని,కోతుల బెడద ఎక్కువ ఉందని కోరితే తక్షణమే ఫెన్సింగ్ ఏర్పాటు చేయించామని అన్నారు. ఇప్పుడు ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేశామని,ప్రతీ పాఠశాలలో చదివే బిడ్డలు నా బిడ్డలే అని,పాఠశాలలో ఉన్న సమస్యలు అన్నీ తీర్చే బాధ్యత తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అంబారావు సర్పంచ్ మండల నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నూతన సర్పంచల పరిచయ కార్యక్రమం

**ప్రజాపక్షం/నేరడిగొండ:**నేరడిగొండ మండలంలోని 32 గ్రామపంచాయతీల నూతన పాలకవర్గాల సర్పంచ్లను బుధవారం ఎంపీడీవో శేఖర్ అధ్యక్షతన పరిచయ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్లను శాలువాలతో మండల అధికారులు సన్మానించి ఒకరినొకరకు పరి



చయచేస్తున్నారు.అనంతరం ఎంపీడీవో నూతన సర్పంచుల ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి పాలకవర్గాలతోనే సాధ్యమని ఇప్పటి నుండి పాలనపరమైన గ్రామ అభివృద్ధి కొరకు ఎల్లవేళలా మండల అధికారులు అందుబాటులో ఉంటారని ఎటువంటి సమస్యలు ఉన్నామా దృష్టికి తీసుకురావాలని మీ పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులకు గ్రామ పంచాయతీ పరిధిలో సమావేశాలు నిర్వహించి,తీర్మానాలు అందించినట్టయితే పనుల పురోగతిపై అందుబాటులో ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అధికారులు,సర్పంచులు,తదితరులు పాల్గొన్నారు.

**నూతన సర్పంచ్‌లక సన్మానం మామడ :**మండలంలోని పొన్కల్ ఉన్నత పాఠశాలలో ఆరు గ్రామాల సర్పంచ్‌లకు ప్రధానోపాధ్యాయులు ఆరవింద్ కుమార్,ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు.పొన్కల్ సర్పంచ్ చిట్యాల లక్ష్మి రాజారెడ్డి,కమల్ కోట్ రావుల ముత్యంరెడ్డి,అనంతపేట తిరుమల్,పోతారం వనజా అశోక్,నల్దుర్తి సుతారి సునీత నారాయణ,బండల ఖానాపూర్ సర్పంచ్ కళ్యాని లతోపాటు పునకలు ఉపసర్పంచ్ రాజారెడ్డి వార్డు సభ్యులను సన్మానించారు.పాఠశాలలో చదువుకున్నామని ఇప్పుడు సర్పంచు లయ్యామన్నారు.పాఠశాల అభివృద్ధి కోసం పాటుపడతామని,పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఆల్ ఇన్ వన్ ను కళగిరి గంగారెడ్డి పంపిణీ చేశారు.అలాగే రూపాయలు 10 లక్షలతో కంప్యూటర్లను కొనుగోలు చేసి ఇస్తానని మాజీ పిఎసిఎస్ చైర్మన్ హరీష్ కుమార్ దీనికోసం భవనాన్ని నిర్మించాలని సూచించారు.ఎమ్మెల్యే సహకారంతో పాఠశాల అభివృద్ధి కోసం కృషి చేస్తానని కొండ్ర రాజారెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు భూమేశ్వర్ వార్డు సభ్యులు వీడిసి ఈడిసి సభ్యులు ఆలయ కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

### సిఐటియు మండల కన్వీనర్ ఆనంద్ రావు

**ప్రజాపక్షం/కెరమెరి:**కాగజ్ నగర్ మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న ఐదు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు మండల కన్వీనర్ కుటికేల ఆనంద్ రావు డిమాండ్ చేశారు. బుధవారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రంలో కాగజ్ నగర్ మున్సిపల్ కార్మికులకు మద్దతుగా పంచాయితీ కార్మికుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాగజ్ నగర్ మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో 17 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారని, 17 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం దారుణమని అన్నారు. తక్షణమే వేతనాలు చెల్లించకపోతే పంచాయితీ విధులు బహిష్కరించి ఛలో కాగజ్ నగర్



పేరుతో మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని, ఆశా, అంగన్వాడి, ఐకెపి, మధ్యాహ్న భోజన కార్మికులు, ఇతర సంఘాలను కలుపుకొని ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కో కన్వీనర్ మడవి అనిల్ కుమార్, గ్రామ పంచాయతీ సిబ్బంది తిరుమల సంతోష్, కుటికేల నగేష్, వాగ్మారే గోపి, మల్లేష్, మల్లెల వెంకటేష్, రాజు, తిరుపతి స్వామి పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో అన్నదానం

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:**శ్రీరాంపూర్ కు చెందిన శ్రీపతి రాములు, కల్పన దంపతులు తమ కుమార్తె శ్రీపతి కీర్తి పుట్టినరోజు వేడుకలను బుధవారం స్థానిక సాయి దృష్టి అందుల పాఠశాల వృద్ధాశ్రమంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఆర్భాటాలకు పోకుండా వృద్ధాశ్రమంలో వేడుకలు జరుపుకోవడం పట్ల పలువురు అభినందించారు. ఆశ్రమంలోని వృద్ధులు కీర్తికి శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు. తమ కుమార్తె పుట్టినరోజును ఇలా జరుపుకో



వడం సంతోషంగా ఉందని, ప్రతి ఒక్కరూ నిరాదరణకు గురైన వారికి సహాయ సహకారాలు అందించాలని రాములు, కల్పన కోరారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, ఆశ్రమ నిర్వాహకులు, వృద్ధులు పాల్గొన్నారు.

## యూరియా విరివిగా వాడదొద్దు



**ప్రజాపక్షం/నందిపేట్ :**నందిపేట్ మండలంలో జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి సొసైటీ కేంద్రాలను బుధవారం తనిఖీ చేసి యూరియా నిలువలను పరిశీలించారు. మండలంలో సరిపడా యూరియా నిలువలు ఉన్నాయని కావున రైతులు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేసుకోవచ్చు. అవసరమైన యూరియాను రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. రైతులు మోతాదుకు మించి యూరియాను వాడకూడదని సూచించారు. ఖుద్వాన్‌పూర్ సొసైటీలో పరిదిలోని వన్నెల్, ఖుద్వాన్‌పూర్, ఐలాపూర్ సొసైటీ పరిదిలోని ఐలాపూర్, కంటం ఎరువుల గోదాములను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాదికారి జి. రాంబాబు, ఏఈవోలు విజయ్, గంగాదర్, అబ్దుల్ పాల్గొన్నారు.

## గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**ప్రజాపక్షం/మోర్తాడ్:**నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండల కేంద్రంలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ టి.పెద్దన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలోని కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టులో ఒక పోసుటకు 2,4,6 సెమీస్టర్‌లో బోధించుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో 55శాతం మార్కులు, నెట్ సెట్, పిహెచ్‌డి, బోధన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో 9–1–26 శుక్రవారం ఉదయం 11.30గంటలకు మోర్తాడ్ మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హాజరు కావాలని ప్రిన్సిపల్ టి.పెద్దన్న తెలిపారు.

## మండల సర్పంచ్‌ల అధ్యక్షుడిగా నందిపేట్ సర్పంచ్



**ప్రజాపక్షం/నందిపేట్:**నందిపేట్ మండల నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు నందిపేట్ సర్పంచ్ సిలిండర్ లింగంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుదవారం కోమటిపల్లి శివారులో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొని కార్యవర్గంను ఎన్నుకున్నారు. అద్యక్షులుగా లింగం నందిపేట్, ఉపాద్యక్షులుగా మీసాల లక్ష్మి నారాయణ అయిలాపూర్, బ్యాగరి జీవన్ మాయాపూర్, కార్యదర్శిగా మంగ్లారం సుప్రియ కుద్వాన్‌పూర్, సహాయ కార్యదర్శిగా గోపు ముత్యం బజార్ కొత్తూరు, కోశాదికారిగా సుష్మ రామకృష్ణ, అధికార ప్రతినిధిగా గొజ్జ దేవేందర్ వెల్మల్, సలహాదారులుగా సంతోష్ గౌడ్ లక్కంపల్లిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరిని సన్మానించారు. మిగతా వారిని సభ్యులుగా గుర్తించారు.

## ఉన్నత విద్యామండలి చైర్మన్‌తో ఎస్సెస్సార్ విద్యాసంస్థల అధినేత

**ప్రజాపక్షం/నిజామాబాద్:** రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాల కృష్ణరెడ్డితో బుధవారం ఎస్సెస్సార్ విద్యాసంస్థల అధినేత మారయ్య గౌడ్ భేటీ అయ్యారు. నిజామాబాద్ జిల్లా పర్యటనకు వచ్చిన బాల కృష్ణారెడ్డితో పలు కీలక అంశాలపై చర్చించారు. ఉన్నత విద్యలో తీసుకరావల్సిన సమూల మార్పులు చేర్పులు యువతకు ఉపాధి మార్గాలు సులువుగా దక్కేలా విద్యాబోధన ఏ విధంగా చేపట్టాలని అంశాలపై చర్చించారు. సాంకేతిక విద్యను కిందిస్థాయి వరకు తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన ప్రణాళికపై ఉన్నత విద్యామండలి చైర్మన్‌తో మారయ్యగౌడ్ కులంకశంగా వివరించారు. గ్రామీణ పేద విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి దక్కించుకునేందుకు నైపుణ్యతను దక్కించుకునేలా ప్రణాళిక ఉండాలని మారయ్యగౌడ్ అభిప్రాయపడ్డారు.

# ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు: కలెక్టర్ సత్పతి

### నిబంధనల ప్రకారం ఇసుక కేటాయించాలి

### కొత్తపల్లి ఇసుక క్వారీ తనిఖీ





**ప్రజాపక్షం/కరీంనగర్:**ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ఇసుక క్వారీ నిర్వహించాలని, అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి పరిధిలోని ఎల్ఎండి రిజర్వాయర్ జలాల నుండి పూడికతీత, పూడిక నుండి ఇసుక వేరు చేసే విధానాన్ని, ఇసుక క్వారీ నిర్వహణను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి పరిశీలించారు. దిగువ మానేరు జలాశయంలో 0.3 టీఎంసీల సామర్థ్యంలో పేరుకుపోయిన పూడికను తొలగించే కార్యక్రమంలో భాగంగా ఈమోట్ ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఈ పూడకతీత పనులను చేపట్టింది. పూడిక నుండి వచ్చిన ఇసుకను వేరు చేస్తూ టీజీఎండిసి పర్యవేక్షణలో వాణిజ్య అవసరాలకు విక్రయిస్తున్న విధానాన్ని కలెక్టర్, సిపి పరిశీలించారు. క్వారీ నుండి ఇసుక లోడింగ్, వేయింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. రికార్డులు, వే బిల్లులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్దిష్ట పరిమితికి మించి ఇసుక తరలించినా, కేటాయించిన వాహనాలు కాకుండా ఇతర వాహనాలు క్వారీలోకి వచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిపి గౌస్ ఆలం మాట్లాడుతూ లోడింగ్ వేయింగ్ సమయంలో నిర్దిష్ట ప్రమాణాలు పాటించాలని అన్నారు. ప్రభుత్వ నిబంధన ప్రకారమే ఇసుక కేటాయింపు ఉండాలని, తనిఖీల్లో అక్రమాలు బయటపడితే కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిజిఎండిసి ప్రాజెక్ట్ ఆఫీసర్ వినయ్ కుమార్, తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, డిఈఈ శ్రీనివాస్, ఏఈఈ సంజన, ఏఈ వంశీధర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసీతారాముడిని దర్శించుకున్న డిఐజి



**ప్రజాపక్షం/గోదావరిఖని:** రామగుండం మండలం ఎన్‌టిపిసి మేడిపల్లి అన్నపూర్ణకాలనీకి చెందిన చెప్యాల సత్యనారాయణమగమ్మ దంపతుల కుమార్తె ఐ.పి.ఎస్. ఉన్నతాధికారైన అంజిత బుధవారం స్థానిక భీమునిపట్నం చిలుకలయ్య గుడిలోని శ్రీసీతారామచంద్రస్వామిని దర్శనం చేసుకున్నారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో స్వామివారికి ఆమె ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దిల్లీలో డి.ఐ.జి.గా పదొన్నతి పొంది మొదటిసారిగా దేవాలయానికి వచ్చిన అంజితకు వేద పండితులు, అర్చకులు, కమిటి సభ్యులు స్వాగతం పలికారు. శాలువాలతో సత్కరించి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చెప్యాల రామారావు, కేశవరావు, వెంకటరామారావు, సతీష్‌రావు, మాధవరావు, శరత్‌రావు, రావికంటి ఈశ్వర్‌లు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు సుడా చైర్మన్ శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/కరీంనగర్‌టౌన్:**నూతన సంవత్సరం సంధర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి బుధవారం కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సంధర్భంగా నోట్ బుక్కులు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

## గొర్రెలకు నట్టల నివారణ మందు

**ప్రజాపక్షం/దండేపల్లి:**దండేపల్లి మండల కేంద్రంలో గొర్రెలకు ఉచిత నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ధన్ రాజ్ మాట్లాడుతూ రైతులు తమ గొర్రెలు, మేకలన్నింటికీ తప్పనిసరిగా నట్టల నివారణ మందులు వేయించాలని కోరారు. ఈ శిబిరంలో 2170 జీవాలకు మందు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అజ్మీరా రాజేశ్వర్ నాయక్, ఉప సర్పంచ్ సిరికొండ నవీన్, మాజీ ఎంపిటిసి ముత్యాల శ్రీనివాస్, వార్డు సభ్యులు కట్కూరి రాజన్న, వెంకటేశ్వర గొర్రెలు మేకల సహకార సంఘం అధ్యక్షులు అల్లంల కుమార స్వామి యాదవ్, పశువైద్య సిబ్బంది స్వాతి, శ్రావణ్ వంశీ, రైతులు పాల్గొన్నారు.

## కస్తూపాఠశాలను తనిఖీ చేసిన సబ్ కలెక్టర్

**ప్రజాపక్షం/ఎడపలి:**ఎడపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, మైనార్టీ పాఠశాలలను బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహాతో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్తులకు కల్పిస్తున్న వసతులపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. బోధన సాగుతున్న తీరు, గదుల లభ్యతను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినుల వసతి సౌకర్యాలను, పడక గదిని తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, టాయిలెట్లు, మురుగునీటి పారుదల సక్రమంగా ఉండాలని ఆదేశించారు. విద్యార్థులకు అందుతున్న తాగునీటి సరఫరా వ్యవస్థను పర్యవేక్షించారు.పాఠశాల కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించిన సబ్ కలెక్టర్, అనంతరం స్టాక్ రూమ్‌ను సందర్శించారు. అక్కడ ఉన్న కిరాణ సరుకుల నాణ్యతను స్వయంగా పరిక్షించారు. నిల్వ ఉంచిన సరుకులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాల స్టాక్ రిజిష్టర్లు, హాజరు పట్టికలను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు.

## గంగాపూర్ జాతర ఏర్పాట్లు పరిశీలించిన డిసిసి అధ్యక్షురాలు



**ప్రజాపక్షం/రెబ్బన:**ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలం గంగాపూర్ గ్రామంలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయాన్ని బుధవారం కుమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షురాలు ఆత్రం సుగుణ సందర్శించి జాతర ఏర్పాట్లను పరిశీలించారు. ఆలయ చైర్మన్ లెండుగూరె జైరాం తో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఆలయం ఎంతో పురాతనమైనదని, తిరుమల తిరుపతి దేవస్థానం తర్వాత అత్యధికంగా భక్తులు దర్శనానికి వచ్చే ఆలయాల్లో ఇది ఒకటని పేర్కొన్నారు. ఈ నెల 30 నుంచి జరగనున్న స్వామివారి కల్యాణోత్సవం, జాతర సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఆలయ అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. అంతకుముందు ఆలయానికి వచ్చిన సుగుణను కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ఇంచార్జి అధ్యక్షుడు కిషన్ గౌడ్, ఆర్‌డిఎ మెంబర్ లావుడ్య రమేష్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గుండ శ్యామ్, ఇందిరా ఫెల్లోషిప్ జిల్లా కోఆర్డినేటర్ కోవ ఇందిరాబాయి, ఆలయ కమిటీ సభ్యులు విమల, దుప్పనాయక్, దుర్గం అన్నాజి, మాజీ సర్పంచ్ చిన్న సోమా శేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, చిరంజీవి గౌడ్, మద్ధి సీను, మాజీ ఎంపిటిసి మద్దెల సురేందర్ రాజు, ఎర్రం తిరుపతి, దుర్గం రాజేష్, ముంజం శ్యామ్, క్రాంతి, సోనాలే సంతోష్ బాబు, లెండుగురె దత్తు, గందె సంతోష్, లింగంపల్లి ప్రభాకర్, బానోత్ రవి, పాల్తే రవి, మహేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 'సింగరేణి' హాకీ పోటీల విజేత శ్రీరాంపూర్ జట్టు




**ప్రజాపక్షం/గోదావరిఖని:** గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ క్రీడా మైదానంలో వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సింగరేణి కంపెనీస్థాయి హాకీ క్రీడా ఫైనల్ పోటీల్లో శ్రీరాంపూర్ జట్టు విజేతగా నిలిచింది. బుధవారం మందమర్రిబెల్లంపల్లి జట్టుతో శ్రీరాంపూర్ జట్టు ఫైనల్ మ్యాచ్‌లో తలపడింది. శ్రీరాంపూర్ జట్టు క్రీడాకారులు ఉత్తమ ప్రతిభను కనబరిచి విజయాన్ని కైవసం చేసుకున్నారు. మందమర్రిబెల్లంపల్లి జట్టు ద్వితీయ స్థానాన్ని గెలుచుకున్నది. విజేత జట్ల క్రీడాకారులకు ఆర్జీ1 జీఎం డి.లలిత్‌కుమార్, సేవా సమితి అధ్యక్షురాలు అనిత లలిత్‌కుమార్‌లు ట్రోఫిలు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, విజేత జట్ల క్రీడాకారులను అభినందించారు. పోటీల్లో పాల్గొన్న మిగతా జట్ల క్రీడాకారులను కూడ అభినందించారు. గెలుపు, ఓటమిలు సహజమని, క్రీడా పోటీలు జీవితంలో ఎదుగుదలకు, ఆత్మస్థైర్యానికి దోహదపడ్తాయన్నారు. విజేతగా నిలిచిన శ్రీరాంపూర్ జట్టు క్రీడాకారులను కోల్ ఇండియా స్థాయి పోటీలకు పంపించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి డిప్యూటి జనరల్ సెక్రటరి మడ్డి ఎల్లయ్యగౌడ్, ఎస్వోటూ జీఎం కె.చంద్రశేఖర్, పర్సనల్ మేనేజర్ ఎం.రవీందర్‌రెడ్డి, ఎ.సురేష్, ఇ.మనోహార్, పెరుమాళ్ల శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, హనుమంతరావు, ఆనందరావు, ఎం.వీరారెడ్డి, శిరీష, చంద్రశేఖర్, బీనాసింగ్, రజిత, కళ్యాణి, విజయప్రసాద్, క్రీడా సూపర్‌వైజర్లు పోనెట్, జాన్‌వెస్లీ, సి హెచ్. అశోక్, పర్స శ్రీనివాసులు, నరేందర్‌రెడ్డి, హె చ్.రమేష్, రిఫరీలు ఎండి.అలియాస్‌ఖాన్, అరిఫుల్లా ఇమామ్, కోఆర్డినేటర్ సామల సత్యనారాయణలు పాల్గొన్నారు.

## బస్టాండ్ ఆవరణలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలి



**ప్రజాపక్షం/వీణవంక:**వీణవంక మండలం మామిడాలపల్లి గ్రామంలోని బస్టాండ్ కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని దళిత సంఘ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గ్రామానికి చెందిన సర్పంచ్ చంద్రమౌళి ఎలాంటి తీర్మాణాలు లేకుండా, 2007 సంవత్సరంలో, అదేవిధంగా ఇప్పటివరకు మూడు దఫాలుగా ఉన్న సర్పంచులు మామిడాలపల్లి గ్రామ బస్టాండ్ కూడలి వద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మాణం చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత గ్రామ సర్పంచ్ చంద్రమౌళి ఎవరికీ సమాచారం ఇవ్వకుండా, ఎటువంటి తీర్మాణం చేయకుండానే బస్టాండ్ సెంటర్‌లో గుంత తవ్వి చత్రపతి శివాజీ విగ్రహం పెడతామని నిర్ణయం తీసుకోవడమేమిటని ప్రశ్నించారు. అంబేద్కర్ విగ్రహం పెట్టేవరకు పోరాటం ఆగదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దరిపెల్లి పోచయ్య, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సురేష్, వార్డు సభ్యులు గుండేటి మౌనిక సుధాకర్, నరసయ్య, దరిపెల్లి మధు, మంతెన లక్ష్మి నారాయణ, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తిరుమలేష్, మహేష్ రవీందర్ శ్రీనివాస్, సుధాకర్, సారయ్య తదితరులున్నారు.

## త్రీఫేస్ విద్యుత్, విశ్రాంతి గదికి అనుమతి ఇవ్వాలి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్/కెరిమెరి:**పరండోలి, ముఖదంగుడా గ్రామాలకు త్రీఫేస్ విద్యుత్ లైన్, కపిలాదేవి క్షేత్రం వద్ద విశ్రాంతి గది నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు మంజూరు చేయాలని జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్ కోరారు. బుధవారం ఈ మేరకు జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా అటవీ శాఖ కార్యాలయ పాలన అధికారి, ఆసిఫాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి అజ్మీర్ శ్యామ్ నాయక్ లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శంకర్ లొద్ది అటవీ ప్రాంతంలో కొలువుదీరిన ఆదివాసుల ఆరాధ్యదైవం కపిలాదేవి పుణ్యక్షేత్రం వద్ద భక్తుల సౌకర్యార్థం విశ్రాంతి గది నిర్మాణం చేపట్టడానికి, గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి అటవీ శాఖ అనుమతులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పరండోలి సర్పంచ్ రాథోడ్ పుష్పలత చరన్, ఆలయ పూజారి లచ్చు పటేల్, ఆలయ కమిటీ సభ్యులు, శంకర్ గ్రామస్తులు కాటే మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థిని అభినందించిన ఎస్పీ

**ప్రజాపక్షం/నిర్మల్‌టౌన్:**క్రీడల్లో రాణిస్తూ రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారని నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జి.జానకి షర్మిల ఐపీఎస్ అన్నారు.బాసర మండలం కిర్గుల్(బి) గ్రామానికి చెందిన ముత్యాల మనోరంజని అనే విద్యార్థిని అండర్17 కబడ్డీ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైంది.ప్రస్తుతం దిలావర్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న మనోరంజని,ఈ ఘనత సాధించడం పట్ల ఎస్పీ హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థిని ఎస్పీని మర్యాదపూర్వకంగా కలవగా,ఆమెను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సత్కరించారు.కష్టపడి సాధన చేస్తే ఏ లక్ష్యమైనా సాధ్యమవుతుందని,క్రీడల్లో చూపే పట్టుదల భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని మనోరంజనిని ఎస్పీ ప్రోత్సహించారు.రాష్ట్ర స్థాయిలోనే కాకుండా జాతీయ స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యతో పాటు క్రీడల్లో రాణించడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు.

## ఆత్మాభిమానం పేరుతో కవిత కన్నీళ్లు డ్రామా

**ప్రజాపక్షం/నిజామాబాద్:**ఆత్మాభిమానం పేరుతో అసెంబ్లీలో ఎమ్మెల్సీ కవిత కన్నీళ్లు పెట్టుకోవటం పూర్తిగా డ్రామా అని, కేసీఆర్ దోచుకున్న సొమ్ములో తనకు వాటా ఇవ్వలేదన్నదే అసలు కారణమని రూరల్ ఎమ్మెల్యే డాక్టర భూపతిరెడ్డి తీవ్రంగా విమర్శించారు. ధర్పల్లి మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అధికారులు ఏర్పాటు చేసిన కళ్యాణలక్ష్మి, షాదీముబారక చెక్కుల పంపిణీలో పాల్గొని ధర్లప్లి, సిరికొండ, ఇందల్వాయి మండలాలకు చెందిన 200 కుటుంబాలకు రూ. 2 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేసి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ద్రోహులకు ఆసరా ఇబ్బంది కవితే కదా అని ప్రశ్నించారు. ఎందరో ప్రజలు కన్నీళ్లు పెట్టుకున్నప్పుడు ఆమెకు ఆత్మగౌరవం గుర్తుకు రాలేదా అని నిలదీశారు.

# గాయత్రి డిగ్రీ, పిజి కళాశాలలో కంటి పరీక్షలు



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి జిల్లా రంగాపూర్ గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరం మూడో రోజులో భాగంగా ఉచిత కంటి పరీక్షా శిబిరాన్ని నిర్వహించారు.నేత్రవైద్య సహాయకులు పూదరి దత్తాగౌడ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి కంటి సమస్యలతో బాధపడుతున్న గ్రామస్థులను శిబిరానికి తీసుకువచ్చారు.ఈ శిబిరంలో వంద మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించగా,వారిలో 37 మందికి కంటి పొరలు ఉన్నట్లు గుర్తించారు.వారికి సంక్రాంతి పండుగ అనంతరం ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తామని రంగాపూర్ గ్రామ సర్పంచ్ గంట రమేష్, గాయత్రి విద్యా సంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు అవసరమైన ఉచిత రవాణా, భోజన వసతులు కూడా కల్పిస్తామని ఆయన భరోసా ఇచ్చారు.శిబిరం అనంతరం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు గ్రామ పరిసరాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో రంగాపూర్ గ్రామ సర్పంచ్ గంట రమేష్,ఉపసర్పంచ్ కొండ శ్రావణ్,పంచాయతీ సెక్రెటరీ గుమ్మడి సదయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.ఏ. సమద్,అధ్యపకురాలు ఆమని తదితరులు పాల్గొన్నారు. సామాజిక సేవలో భాగంగా విద్యార్థులు చూపుతున్న చైతన్యం ఆదర్శప్రాయమని గ్రామస్థులు ప్రశంసించారు.

## చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

### 5 సంవత్సరాలలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని హెల్త్ సబ్ సెంటర్ లో బుధవారం ప్రభుత్వ వైద్యుడు అమరేందర్ రావు ఆదేశాల మేరకు ఏఎన్ఎం సునీత తోపాటు సిబ్బంది ఆధ్వర్యంలో జీరో నుండి 5 సంవత్సరాలలోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ నవజాత శిశువు రోగాల బారిన పడకుండా ఉండాలంటే వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి వేయించాలని అన్నారు.పుట్టిన బిడ్డ నుంచి 16 ఏళ్ల వయసు వచ్చే వరకు పలు విడతలుగా ప్రభుత్వం ఉచితంగానే టీకాలు పంపిణీ చేస్తోందని, బీసీజీ నుంచి టీడీ వరకు అన్ని రకాల టీకాలు అందుబాటులో ఉంటున్నాయని అన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు కూడా తమ బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ నిర్దేశించిన కాలమానిని ప్రకారం టీకాలు వేయించాల్సిన అవసరం ఉందని సునీత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు జ్యోతి, శశికళ, రజిత తో పాటు తదితరులు ఉన్నారు.

## గాయత్రి విద్యానికేతన్‌లో చదరంగం పోటీలు

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** పెద్దపల్లి పట్టణములో ఈనెల 11న పెద్దపెల్లి జిల్లా చదరంగ సమాఖ్య, శ్యామ్‌పటేల్ శ్రీనివాస్ పటేల్ ఆధ్వర్యంలో వారి తండ్రి రాజేంద్ర ప్రసాద్ స్మారక ఇంటర్ డిస్ట్రిక్ట్ చదరంగ పోటీలు నిర్వహించుతున్నట్టు జిల్లా చదరంగ సమాఖ్య అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ తెలియజేశారు. ఈ పోటీలలో పాల్గొనదలచిన క్రీడాకారులు ఆదివారం రోజున ఉదయం 9 గంటలకు గాయత్రీ విద్యానికేతన్, అమర్‌నగర్, పెద్దపల్లిలో తమ పేర్లను సకాలంలో నమోదు చేసుకోవాలని, ఈ పోటీలలో విజేతలకు 8 నగదు బహుమతులు మొదటి బహుమతి రూ.1500/ నుండి ఎనిమిదవ బహుమతి రూ.200/ వరకు మరియు U9,U11,U15 క్రీడాకారులకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామని తెలియజేశారు. క్రీడాకారులు చెస్ బోర్డులు పావులు వెంట తెచ్చుకోవాలని ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. క్రీడాకారులకు మధ్యాహ్న భోజన సౌకర్యం, ఇతర వివరాలకు జీ శ్రీనివాస్ సెల్ :9515 342207, కె.దేవేందర్ గౌడ్ సెల్ : 9989198432, సూరజ్ సింగ్ సెల్ :8096659481లను సంప్రదించాలని తెలిపారు.

# అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సర్పంచ్



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వారం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సర్పంచ్ బియ్యని శివ కుమార్ సందర్శించి అంగన్వాడి కేంద్రం పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రానికి వచ్చే చిన్నారుల కల్పించే వసతులను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార నాణ్యతను స్వయంగా రుచి చూసి పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం ప్రతి రోజూ గుడ్లు, పాలు అందుతున్నాయో లేదో పిల్లలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణీలు, బాలింతలకు పంపిణీ చేసే బాలామృతం రేషన్ సక్రమంగా అందుతోందని అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడి కేంద్రంలోని అటెండెన్స్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లల హాజరు శాతాన్ని వంద శాతం పెంచేలా చర్యలు తీసుకోవాలని కార్యకర్తలకు సూచించారు.కేంద్రం ఆవరణను వంట గదిని ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. చిన్నారులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందికి చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బియ్యాని శివకుమార్‌తో ఉప సర్పంచ్ పిట్టల రామస్వామి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు జంగా మోహన్ రెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు. సర్పంచ్‌కి ఉపాధ్యాయుల సన్మానం పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం మైదంబండ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వారం గ్రామంలోని ప్రభు త్వ పాఠశాల ఉపాధ్యాయుల తో పాటు అంగన్వాడి టీచర్ ఆధ్వర్యంలో బుధవారం సర్పంచ్ శివకుమార్, ఉప సర్పంచ్ రామస్వామికి శాలువాలతో సన్మానం చేశారు

# పౌష్టిక ఆహారంతోనే పిల్లల్లో ఎదుగుదల సమృద్ధి

### సర్పంచ్ దికొండ భూమేష్ కుమార్



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పౌష్టిక ఆహారంతోనే పిల్లలలో పిల్లలలో ఎదుగుదల సమృద్ధిగా ఉంటుంది అని సుల్తానాబాద్ మండలం ఐతరాజ్ పల్లి గ్రామ సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్ అన్నారు. బుధవారం గ్రామంలోని 2వ అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ భూమేష్ చేతులమీదుగా అన్నప్రాసన,అక్షరబ్యాసం కార్యక్రమం నిర్వహించారు. 6 నెలల నుండి 3 సంవత్సరాల లోపు వయసు గల పిల్లలకు బాలమృతం, కోడిగుడ్లు పంపినీ చేసారు. పిల్లలకు అక్షరబ్యాసం చేయించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ దీకొండ భూమేష్ కుమార్ హాజరై మాట్లాడుతూ పిల్లకు పోష్టికాహార అందిస్తే వారిలో ఎదుగుదల సమృద్ధిగా ఉంటుందని అన్నారు. పిల్లలకు బాలింతలకు, అంగన్వాడీకేంద్రలా ద్వారా పిల్లలకుఅందుతున్నసేవలు. అభిందనియమని అన్నారు.చదువు సంధ్యలతో పాటు పిల్లలు వారి తల్లుల ఆరోగ్యం పట్ల అందుతున్న పౌష్టిక ఆహారం సేవలు ఎంతో ప్రయోజనకారంగా ఉంటున్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దాసరి మధుసూదన్ రెడ్డి, ఏఎన్ఎంలు షబానా, భూలక్ష్మి ఆశ వర్కర్ ప్రమీల,స్వరూప, వార్డ్ మెంబెర్స్ పున్నం రజిత రాజు, గుడాల మారుతి, న్యాతరి అరవింద్, ఎర్రం రమణా రెడ్డి, దాసరి రమ్య,అంగన్వాడీ టీచర్స్‌మాధవి, శ్రీలత ఆయా రజిత సిఎలు రజినీ, నవ్య పాల్గొన్నారు.

# మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో అభివృద్ధి దిశలో కాంగ్రెస్

### అభివృద్ధిపై మాట్లాడే నైతిక అర్హత పుట్ట మధుకు లేదు

### జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం




**ప్రజాపక్షం/ముత్తారం :** రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు, ముత్తారం మండల మాజీ జడ్పిటిసి చొప్పరి సదానందం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పిటిసి చొప్పరి సదానందం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొడ్డ బాలాజీ, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు మద్దెల రాజయ్యలు మాట్లాడుతూ మంగళవారం బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కమాన్‌పూర్ మాజీ జడ్పిటిసి పుట్ట మధు ముత్తారంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని మాట్లాడడం సరికాదని మండల కాంగ్రెస్ పార్టీ తరపున ఆ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గత పది సంవత్సరాలు బిఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నన్ని రోజులు మండలంలోని రోడ్లన్నీ ఎంతటి అధ్వాన్న పరిస్థితికి వచ్చాయో ప్రజలందరికీ తెలుసునని, ఆ రోడ్ల దుస్థితికి గల కారణం ఇంకా ప్రజలెవరూ మరువలేదని అన్నారు. ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు నాయకత్వంలో ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామం నుండి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఉన్న సొంత గ్రామం ఓడేడు వరకు 30 కోట్ల రూపాయలతో రోడ్డు నిర్మించామని, అభివృద్ధి పనులు నడుస్తున్నాయన్నారు. ఇప్పటికైనా నిద్రమత్తు వదిలి ముత్తారం మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులను కళ్ళు తెరిచి చూడాలని పుట్టమధుకు హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.

## రైతులకు అందుబాటులో యూరియా

**ప్రజాపక్షం/ముత్తారం :** ముత్తారం మండలంలో వ్యవసాయ సహకార సంఘం,ఆగ్రోస్ రుతు సేవ కేంద్రం తోపాటు ప్రైవేటు డీలర్ల వద్ద మొత్తం 4000 వేల యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని యూరియా అవసరమున్న రైతులు యాప్ ద్వారా నమోదు చేసుకుని దగ్గరలో ఉన్న కేంద్రాలలో యూరియా తీసుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటన తెలిపారు. యూరియా బుక్ చేసుకోలేని రైతులు సంబధిత వ్యవసాయ విస్తరణ అధికారులను లేదా యాప్ అవగాహన ఉన్న రైతుల ద్వారా తెలుసుకొని యూరియా బుక్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి అనూష ఒక ప్రకటనలో తెలిపారు.

## బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు




**ప్రజాపక్షం/ముత్తారం :** గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీలను బుధవారం ముత్తారం మండలంలోని ఓడేడు గ్రామంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో 18 సంవత్సరాలకు లోపు బాలల హక్కులను రక్షించడంలోనూ పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కరించడంలోనూ వివిధ శాఖలలో పిల్లలకు సంబంధించిన పథకాలను అందించడంలోని ప్రాముఖ్యత పాత్ర పోషిస్తూ గ్రామంలోని పిల్లల సమగ్ర అభివృద్ధికి తోడ్పడుతూ నేటి బాలలే రేపటి పౌరులు అన్న నమ్మకాన్ని నిజం చేయుటకు అందరూ కలిసికట్టుగా ఉండాలని తీర్మానం చేయడం జరిగిందని సర్పంచ్ కవిత కిషన్ రెడ్డి అన్నారు.గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ చైర్మన్ గా సర్పంచ్ కవిత కిషన్ రెడ్డి,సభ్యులుగా ఆశ వర్కర్ సుజాత,అలాగే పాఠశాల ఉపాధ్యాయులు,మహిళా సంఘం సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి సభ్యులుగా ఉన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు రజిత, మధుమతి, మొగిలి రజిత తో పాటు చిన్నారుల తల్లులున్నారు.

## 57వ డివిజన్ నుండి ఎన్నికల బరిలో వంశీకృష్ణ

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 57వ డివిజన్ తనకు కుటుంబంలాంటిదని, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉండడమే తన జీవన విధానమని 57వ డివిజన్ అభ్యర్థి బూరుగు వంశీకృష్ణ అన్నారు. మాటలకే పరిమితం కాకుండా సేవే తన రాజకీయ పునాదని ఆయన పేర్కొన్నారు. డివిజన్‌లో మౌలిక సదుపాయాలు కల్పించడం, తాగునీటి సమస్యలు, నిరుద్యోగం రూపుమాపడం, ఉపాధి కల్పన, డివిజన్లో డ్రైనేజీ, రోడ్ల అభివృద్ధి, మహిళ సంక్షేమ అభివృద్ధి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. అలాగే అభివృద్ధిలో మహిళలు, యువతకు అవకాశాలు కల్పించడం, పేదల సమస్యలపై తక్షణ స్పందన తన ప్రధాన ప్రాధాన్యాలని ఆయన స్పష్టం చేశారు.రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో 57వ డివిజన్ నుండి బరిలోకి దిగుతున్నట్లు బూరుగు వంశీకృష్ణ తెలిపారు. ప్రజల నమ్మకమే తన బలమని, ప్రజల ఆశీస్సులు, సహకారంతో విజయం సాధించి డివిజన్ అభివృద్ధికి నిజాయితీగా పని చేస్తానని ఆయన మాటిచ్చారు.

## సమస్యలపై కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం ఇస్సంపేట గ్రామ సమస్యలు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను కోరినట్లు గ్రామ సర్పంచి దారవేణి సాయికుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపినట్లు చెప్పారు. నూతన సర్పంచిగా ఎన్నికైన తాను గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఇందుకోసం జిల్లా, మండల అధికారుల నుంచి తగిన సహకారం కావాలని కోరినట్లు సాయికుమార్ తెలిపారు.

## ఉపసర్పంచ్‌కి సన్మానం

**ప్రజాపక్షం/ముత్తారం :** శ్రీశ్రీశ్రీ రామానుజ జీయర్ స్వామిచే పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని మచ్చుపేట గ్రామ ఉప సర్పంచ్‌గా దోంతుల రాకేష్ ఎన్నికైనందుకుగాను ప్రగతి పాఠశాల కరస్పాండెంట్ అబ్బు కేశవరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారిచే సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విజ్ఞా వికాస్, ట్రస్మ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు, ఓదెలు, రాజయ్య, లక్ష్మీ నారాయణ, పాఠశాల ఇంచార్జ్ గోవర్ధన్ రావు,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిన్నారులకు అక్షరభ్యాసం




**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రంలో బుధవారం చిన్నారులకు గ్రామ సర్పంచ్ సూదాటి రవీందర్ రావు చేతుల మీదుగా అక్షరాభ్యాసం, అన్నప్రసన్న కార్యక్రమాలు నిర్వహించారు. సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గర్భిణులు,బాలింతలు పౌష్టికాహారం ఎంతో అవసరమని సర్పంచ్ రవీందర్‌రావు అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషకాలు కలిగిన ఆహారం అందించడమే కాకుండా ఎలాంటి ఆహారం తీసుకోవాలి అనే విషయాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ సత్యవతి, సుజాతతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీ పనులను ప్రారంభించిన సర్పంచ్



**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామ సర్పంచ్ బొంతల అన్నపూర్ణ ఉపేందర్, ఎంపీఓ పవన్ కుమార్, ఉప సర్పంచ్ తిరుపతి, గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి, ఆధ్వర్యంలో బుధవారం గ్రామపంచాయతీ అవరణ ముందు నర్సరీ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాలను పచ్చగా, పరిశుభ్రంగా ఉంచడానికి నర్సరీలో మొక్కలను పెంపకానికి ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటే గ్రామంలోని ప్రజలు ఆరోగ్యంగా, సుభిక్షంగా ఉంటారని అందుకే నర్సరీలో ప్రజలకు ఉపయోగపడే విధంగా పండ్ల మొక్కలు,పూల మొక్కల తోపాటు పలు రకాల మొక్కలను పెంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ హరిత తిరుపతి, గ్రామపంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరితో పాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ఆయా శాఖల అధికారులు కలిసి కట్టుగా కృషి చేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ నెల 01 వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఆపరేషన్ స్మైల్ 2026 కార్యక్రమాన్ని నిర్వహించనున్న సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక శాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా తనిఖీలు చేయాలని ఆదేశించారు. జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ ప్రాంతాల్లో 18 ఏండ్లలోపు పిల్లలు భిక్షాటన ఉండకూడదని స్పష్టం చేశారు. ఎవరైనా కనిపిస్తే వెంటనే సమీప విద్యాలయాల్లో చేర్పించాలని సూచించారు. ప్రభుత్వ వసతి గృహాల్లో అడ్మిషన్ ఇప్పించాలని పేర్కొన్నారు. బడీడు పిల్లలు కచ్చితంగా బడిలోనే ఉండాలని స్పష్టం చేశారు. ఘనంగా లూయిస్ బ్రెయి లీ జయంతి వేడుకలు..లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై దివ్యాంగులతో కలిసి బ్రెయిలీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పలువురు దివ్యాంగులను ఇంచార్జి కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఆర్డీఓ గీత, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మెన్ అంజయ్య, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మిరాజం, జిల్లా వైద్యాధికారి రజిత, నజీర్ అహ్మద్ పాల్గొన్నారు.

## పాఠశాల భవనాన్ని పునర్‌నిర్మించాలని కలెక్టర్‌కు వినతిపత్రం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** శిధిలమైన పాఠశాల భవనాన్ని పునర్నిర్మించి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు నిర్మించాలని పెద్దపెల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ను మంచరామి గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మీ కలిసి వినతి పత్రం అందజేశారు. బుధవారం మంచిరాన్ని సర్పంచ్ ఉప్పు లక్ష్మి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీహర్షకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన అనంతరం గ్రామంలోని పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందని, విద్యార్థులకు ప్రమాదకరంగా మారిందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే నూతన పాఠశాల భవనాన్ని మంజూరు చేసి విద్యార్థులకు బంగారు భవితకు బాటలు వెయ్యాలని కోరారు.అదేవిధంగా గ్రామానికి సంబంధించిన పలు అభివృద్ధి సమస్యలపై చర్చ జరిపి పరిష్కారాలు సూచించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం 31వ డివిజన్ క్రషర్ నగర్ కు చెందిన మెదరి గణేష్, మెదరి శివ, మెదరి నరేష్ లు హై టన్షన్ కరెంట్ తీగలు తగిలి అనారోగ్యం చెందిన కుటుంబాలకు బీ.ఆర్.ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు, వీహెచ్ ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వ్యాల హరీష్ రెడ్డి పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ భాదితులకు దురదృష్టవశాత్తు కరెంటు షాక్ తగలడం బాధా కరమనీ, వారికి బీ.ఆర్. ఎస్ పార్టీ తరుపున, హరీష్ రెడ్డి ఫౌండేషన్ తరుపున అండగా ఉంటామని,అలాగే రామగుండం నియోజకవర్గంలో ప్రజలకు కష్టసుఖాల్లో ఎల్లవేళలా బీ.ఆర్.ఎస్ శ్రేణులు, హరీష్ రెడ్డి ఫౌండేషన్ తరుపున భరోసాగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో రామగుండం నియోజకవర్గం మాజీ కార్పొరేటర్ రమణారెడ్డి,బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జహీద్ పాషా,బూరుగు వంశీకృష్ణ, తన్నీరు రాకేష్, ఈదునూరి శంకర్,మడిశెట్టి రవి,అల్లి గణేష్, కొండా సురేష్, అనిత,మంగ,దిలకళ రూత,రామగిరి రమేష్,రాము,తదితరులు పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యార్థం సొంత నిధులతో రోడ్డు నిర్మాణం



**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక గ్రామంలో అత్యంత వైభవోపేతంగా నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరకు గ్రామ సర్పంచ్ సట్టు ఉత్తమ కుమారి, ఉపసర్పంచ్ కోదాటి తిరుపతరావు ఆధ్వర్యంలో ఏర్పాటులో చకచక కొనసాగుతున్నాయి. అత్యంత జనసంద్రం వచ్చే అవకాశం ఉన్నందున భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ ఉత్తమ కుమారి ఉపసర్పంచ్ తిరుపతిరావు గ్రామ పాలకవర్గంతో కలిసి దాదాపు లక్ష యాభై వేల రూపాయల స్వంత ఖర్చుతో కిలోమీటర్ మేర మట్టి తో రోడ్డు మరమ్మత్తులు చేపించారు. అనంతరం సర్పంచ్ ఉత్తమ కుమారి, ఉపసర్పంచ్ తిరుపతిరావు, పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అవసరాలకు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రవీందర్ రెడ్డి, వార్డు సభ్యులు వేణి శ్యామల, వడ్లూరి లక్ష్మి , సట్టు లక్ష్మి , భూషణ వేణి కనక లక్ష్మి , దొంతుల అనిల్, పుల్లూరి విజయ, లతోపాటు తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్స్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండలం కేంద్రంలో ఫర్టిలైజర్ షాప్ యజమానాలపై చర్యలు తీసుకోవాలని బుధవారం డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మహేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్నటువంటి ఫర్టిలైజర్ షాప్ వారు అధిక ధరలకు ఫర్టిలైజర్స్ అమ్మడం జరుగుతుంది. వీటి పైన చర్యలు తీసుకోవాలని అదేవిధంగా యూరియా కావాలంటే ఇతర ఫర్టిలైజర్స్ తీసుకుంటేనే యూరియా ఇస్తామని రైతులను ఇబ్బంది గురి చేస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలి అదేవిధంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు అమ్ముతున్న ఫర్టిలైజర్ షాప్స్ పైన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారికి వినతి పత్రం అందించారు.

## పదో తరగతి విద్యార్థులకు ఆటోల సౌకర్యం



**ప్రజాపక్షం/అంతర్గాం :** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిరోజూ సాయంత్రం వేళల్లో తరగతులకు హాజరు అవుతున్న పదో తరగతి విద్యార్థుల సౌకర్యార్థం డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం ఛారిటబుల్ ట్రస్టు వారు ఆటోలను ఉచితంగా ఏర్పా టు చేశారు. తరగతుల అనంతరం సాయంత్రం వేళల్లో పాఠశాల నుంచి దూర ప్రాంత గ్రామాల్లోని తమ ఇంటికి వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్తున్నారని తెలుసుకొని, వారు క్షేమంగా తమ ఇంటికి వెళ్లేలా బుధవారం నుంచి ఆటోలను ట్రస్టు ద్వారా ఉచితంగా ఏర్పాటు చేసినట్లు ట్రస్టు ఛైర్మన్, టిటిఎస్ అంతర్గాం గ్రామ సర్పంచి రవికుమార్, ట్రస్టు సభ్యులు తెలిపారు.

## వంద శాతం పన్నులు వసూలు చేయాలి

### జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య

**ప్రజాపక్షం/ముత్తారం :** పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే గ్రామాల్లో వంద శాతం పన్నులు వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య అన్నారు. బుధవారం ముత్తారం మండల ప్రజాపరిషత్ కార్యాలయం ఆవరణంలో గ్రామపంచాయతీ కార్యదర్శులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాలలో ఇంటి, నీటి కుళాయి పన్నులను వసూలు చేయాలన్నారు. లైసె న్స్ ఫీజులు వసూలు వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఈనెల ఖరా రులోగావంద శాతం వసూలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో సురేష్, ఎంపీ ఓ పవన్ కుమార్ తోపాటు గ్రామపంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

## జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక



**ప్రజాపక్షం/రామగుండం :** రామగుండం పట్టణానికి చెందిన హర్షవర్ధన్ పూణెలో జరిగే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనట్లు శిక్షకుడు వడ్డేపల్లి సురేష్ తెలిపారు. ఈ సందర్భంగా హర్షవర్ధన్‌కు నగదు ప్రోత్సహాకాన్ని అందజేసినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లికొండ రాజేష్, భరోసా స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకురాలు నసీమా తెలిపారు. ఇటీవల జరిగిన ఎస్.జి.ఎఫ్. రాష్ట్రస్థాయి పోటీల్లో హర్షవర్ధన్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంతో మంది విద్యార్థులకు కరాటే శిక్షణ ఇస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న శిక్షకుడు సురేష్‌ను, జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన హర్షవర్ధన్‌ను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సుభోద్ పాఠశాల నిర్వాహకులు రాంసింగ్, బల్వన్‌సింగ్, రమేష్ తెలిపారు.

## విద్యార్థులందరిని ఒకేలా చూడాలి

### - ఎంఈఓ నిమ్మ రాజిరెడ్డి

**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండల విద్యావనరుల కేంద్రంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవంను పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మండల విద్యాధికారి నిమ్మ రాజిరెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాలలో ఉన్న వికలాంగుల విద్యార్థులను కూడా అందరితో సమానముగ చూడాలని తెలిపారు, అలాగే ప్రతి శుక్రవారం మండల వనరుల కేంద్రంలో జరిగే ఫిజియోథెరపి క్యాంపుకు అందరు హాజరు కావాలని తెలిపారు. అలాగే ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు అతిధుల చేతుల మీదుగా బహుమతులు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి స్థానిక వార్డు సభ్యులు రంజాన్ నరేష్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి ఐఆర్పి గౌతమ్ మేడం ఎంఆర్సి సిబ్బంది రాజేందర్, రమాదేవి సిఆర్పిలు పాల్గొన్నారు.